
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
వనపర్తి
జిల్లా వార్తలు
ఆదివారం 10 ఆగస్టు 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0



భక్తి శ్రద్ధలతో తీజ్ వేడుకలు
● మిడ్జిల్ మండలం వేముల పంచాయతీ తమ్మడకుంట తండాలో సంబురాలు 7
● మొలకల తొట్లతో ఊరేగింపు.. ప్రత్యేక పూజలు
● ఘనంగా సేవాలాల్ మహరాజ్ భోగ్‌బండార్ కార్యక్రమం

హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం



ఆదివాసీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చెంచులు

7

15 ఏళ్లుగా సమగ్ర శిక్షా ఉద్యోగుల వెతలు
» క్రమబద్ధీకరణ కోసం సమ్మె చేసినా దక్కని ఫలితం
» జిల్లాలో వివిధ విభాగాల్లో 433 మంది ఎస్ఎస్ ఉద్యోగులు



గద్వాలలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు (ఫైల్)

6



అయిజ పులికల్ మధ్య పోలోని వాగుపై కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణపు పనులు, సర్వీస్ రోడ్డు కొట్టుకుపోవడంతో స్తంభించిన రాకపోకలు

వంతెనలిలా.. వెళ్లేదెలా?

» కాజ్‌వేల వద్ద రాకపోకలకు అంతరాయం
» అంతర్రాష్ట్ర రహదారిపై నిలిచిపోతున్న ప్రయాణం
» మధ్యలోనే నిలిచిపోయిన గార్లపాడు వంతెన
» ఆరేళ్లుగా సా..గుతున్న పోలోని వాగు బ్రిడ్జి నిర్మాణం

జోగుళాంబ గద్వాల జిల్లాలో కొద్దిపాటి వర్షాలు కురిసినా చాలా గ్రామాల ప్రజలు ఊరు దాటలేని పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాలకు కాజ్‌వేలు నిర్మించారు. కొద్దిపాటి వర్షాలకే కాజ్‌వేలపై నుంచి వరద పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రాజోలి మండలం, ముండ్లదిన్నె, పెద్దతాండ్రపాడు గ్రామాల నుంచి మండల కేంద్రానికి, వ్యవసాయ పొలాలకు రావాలంటే తుమ్మలవాగులో దిగి రావాల్సిందే. వర్షం కురిస్తే వాగు అత్యంత ప్రమాదకరంగా పారుతుంది. దీంతో వెంకటాపురం మీదుగా సుమారు 20కిలోమీటర్ల దూరం ప్రయాణించి రాజోలికి చేరుకోవాల్సి ఉంటుంది. ఇలా చాలా గ్రామాల ప్రజలు చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలకు అంతరాయం ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కాజ్‌వేల స్థానంలో వంతెనలు నిర్మించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- అలంపూర్ చౌరస్తా, ఆంధ్రజ్యోతి



మానవపాడు మండల కేంద్రానికి అమరవాయి గ్రామానికి మధ్య నిలిచిన రాకపోకలు

7

జాబితాలో.. అనర్హులు

» ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు



సల్కెలపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

» అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్
» మేనేజర్, వార్డు అధికారి సస్పెన్షన్
» ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న నిజాలు
» నిబంధనలతో అయోమయంలో లబ్ధిదారులు

వనపర్తి టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కల నిజం చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకమే ఇందిరమ్మ ఇల్లు. ఈ పథకంలో అక్రమాలు చోటు చేసుకోవడంతో నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారు. వనపర్తి నియోజకవర్గం వ్యాప్తంగా మొదటి విడతలో 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో ఉన్న ఐదు మునిసిపాలిటీల్లో ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎంపికైన వారికి పట్టాలు అందజేశారు. కానీ ఇందులోనే కొందరు అనర్హులు ఉన్నారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. గత నెల 22న ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై ఒక మేనేజర్‌తో పాటు మరో 10 మందికి షోకాస్ నోటీసులు జారీ చేశారు. అందుకు సమాధానంగా గత నెల 27న అధికారులు వివరణ ఇవ్వగా.. వివరణ సరైందిగా లేని కారణంతో ఒక మేనేజర్, ఒక వార్డు ఆఫీసర్‌ను గత నెల 28న సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఐదు బల్దియాలలో..

జిల్లాలో వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత ఐదు మునిసిపాలిటీలు ఉన్నాయి. అయా మునిసిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వం విధించిన నిబంధనలతో అయోమయంలో పడుతున్నారు. పెబ్బేరు మునిసిపాలిటీలో 143 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. వారిలో 16 మంది ఆర్థిక స్థోమత లేక ముందుకు రావడం లేదు. ప్రభుత్వ షరతుల వల్ల మరో ముగ్గురు తమకు ఇందిరమ్మ ఇల్లు వద్దని నిర్మాణానికి దూరంగా ఉంటున్నారు. ఆత్మకూరులో 219 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 135 మందిని వివిధ కారణాలతో రిజెక్టు చేశారు. కేవలం 84 మంది మాత్రమే అర్హులుగా గుర్తించారు. అమరచింతలో 85 మందికి ఇళ్లు మంజూరు కాగా వారిలో 29 మందిని రిజెక్ట్ చేశారు. ఇద్దరు తమకు ఇందిరమ్మ ఇల్లు వద్దని రాతపూర్వకంగా తెలిపారు. వనపర్తి మునిసిపాలిటీలో 577 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ పత్రాలు అందజేశారు. వీరిలో కొందరు అనర్హులు ఉన్నట్లు బయట పడటంతో ఏకంగా 12 మంది తమకు సొంత ఇళ్లు ఉన్నాయని, ఇందిరమ్మ ఇల్లు వద్దని కమిషనర్‌కు రాతపూర్వకంగా తెలిపారు. దాదాపు 200 మంది లబ్ధిదారులు నిర్మాణాలకు సిద్ధమై పనులు మొదలు పెట్టారు.

అనర్హుల పేర్లు జాబితా నుంచి తొలగిస్తాం

ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారి పేర్లు జాబితా నుంచి తొలగిస్తున్నాం. అంతేకాకుండా క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిశీలించిన తరువాత జాబితాలో ఉన్నవారికి సొంత ఇళ్లు ఉన్నట్లుగా గుర్తించాం. ఆత్మకూరులో 219 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 135 మందిని అనర్హులుగా గుర్తించాం.

- శశిధర్, మునిసిపల్ కమిషనర్, ఆత్మకూర్

ముందే బేస్‌మెట్ ఉంటే క్యాన్సిల్..?

నిరుపేదలు కొద్దిగా జమ చేసుకున్న డబ్బుతో ఇదివరకే బేస్‌మెట్ లెవల్ వరకు పనులు చేసుకొని వదిలేశారు. మళ్లీ డబ్బులు జమ చేసుకొని గోడలు నిర్మించుకుందామని అనుకున్నారు. అంతలోనే ఇందిమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపిక చేశారు. కానీ గతంలో బేస్‌మెంట్ నిర్మించుకున్న బేస్‌మెంట్ కూడా తొలగించి కొత్తగా నిర్మాణ పనులు చేపడితేనే యాప్‌లో వివరాలు నమోదు అవుతాయి, లేదంటే రిజెక్ట్ అవుతుందని అధికారులు చెబుతుండటంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

గద్వాల క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల ఏ సమస్య తలెత్తినా వెంటనే స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్అండ్‌బీ, వైద్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ స్పందించే విధంగా పోలీస్ అధికారులను సిద్ధం చేశామని తెలిపారు. అలాగే కృష్ణ, తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గొర్రెలు, పశువుల కాపరులు వాగులు, వంకలు వైపు వెళ్లవద్దని పేర్కొన్నారు. గ్రామాలలో కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకునేందుకు గస్తీ పోలీసులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని తెలిపారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్ 100, 8712670306కు కాల్ చేయాలని సూచించారు.

వైభవంగా వేంకటేశుడి కల్యాణం



నదీ అగ్రహారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గద్వాలటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గద్వాల పట్టణ సమీపం నదీఅగ్రహారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతీ పౌర్ణమిరోజు ఈ ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంలో శ్రావణశుద్ధ పౌర్ణమి హయగ్రీవస్వామి జయంతి కావడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా పట్టణంలోని భీమ్‌నగర్ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద హయగ్రీవమూర్తికి పూజలు చేశారు. స్థానిక భక్తమార్కండేయ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పద్మశాలీలు జంధ్యాల పౌర్ణమిగా ఆచరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నూతన జంధ్యాలు ధరించారు.

భారీ వర్షం

» జోగుళాంబ గద్వాలలో దంచికొట్టిన వాన
» పొంగి పొర్లిన వాగులు, వంకలు
» నీట మునిగిన పంటలు
» రాకపోకలకు ఇబ్బంది పడిన ప్రజలు




వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని శేరుపల్లిలో నీట మునిగిన వరి పంట

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జోగుళాంబ గద్వాల జిల్లా అతలాకుతలం అవుతోంది. భారీ వర్షాలకు జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. జూలకల్లు వద్ద కర్నూల్- రాయిచూర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై నీళ్లు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురం రంగసముద్రం అలుగునీటి ప్రవాహానికి వరి పంట నీట మునిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. వరి పైర్లు నీట మునిగాయి. నల్లమల అటవీ ప్రాంతంలో వాగులు, వంకలు పారుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


6

నల్లమలో పారుతున్న లొద్దికట్టు కాలువ





నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి శివారులో నీట మునిగిన వరి పైరు



గద్వాల జిల్లా కర్నూల్- రాయిచూర్ రహదారిపై పారుతున్న వరద



వర్షపు నీటిలో అయిజ పీహెచ్‌సీ

నువ్వు నాకు రక్ష.. నేను నీకు రక్ష



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న గద్వాల జడ్పీ మాజీ చైరపర్సన్ సరిత



గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి రూప



అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు రాఖీ కట్టి ఆశీర్వదిస్తున్న ఆయన సోదరీమణులు

అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య బంధాన్ని తెలియజేసే పండుగగా రక్షాబంధన్‌ను జరుపుకుంటారు. సోదరీమణులు తమ సోదరులకు నుదుట బొట్టుపెట్టి చేతికి రాఖీ కట్టి నోరు తీపి చేస్తారు. అదేవిధంగా సోదరులు కూడా తమ సోదరీమణులకు కానుకలు ఇచ్చి తమ అనుబంధాన్ని తెలియజేసుకుంటారు. శనివారం నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల వ్యాప్తంగా ఈ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యేలకు వారి సోదరీమణులు, వివిధ వర్గాలకు చెందిన వారు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ANDHRA JYOTHI CLASSIFIEDS
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్
★ 24 గంIIలు, 12 గంIIలు వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్నపిల్లలను చూసుకోవడానికి & వంటపనికి, మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని ఫ్రీ/వు లను పంపించగలము. సంIIప్రII 8977263124 & 9100116067
AJW-6637

ANDHRA JYOTHI CLASSIFIEDS
3+1 Scheme
ప్రతి 4 లైన్లకు 200/- రూ
ప్రతి అదనపు లైను 45/- రూ
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు. బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

దొంగల హల్‌చల్
» తాళం విరగ్గొట్టి 15తులాల బంగారు నగలు, రెండు లక్షల నగదు చోరీ 7

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కడ్తాల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు గ్రామానికి చెందిన శివకృష్ణ హైదరాబాద్‌ల్ టిప్పర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శివకృష్ణ సోదరి స్వప్న పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతుందన్న సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి బైక్ పై కోడేరుకు బయలు దేరాడు. ఈ క్రమంలో కడ్తాల్ సమీపంలోని రాఘవేంద్ర హోటల్ ఎదుట శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శివకృష్ణను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శివకృష్ణ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శివకృష్ణ తల్లి సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.



మృతి చెందిన శివకృష్ణ (ఫైల్)

నాటు తుపాకీ కలకలం

కోడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని ఎత్తం గ్రామంలో శనివారం నాటు తుపాకీ కలకలం సృష్టించింది. గ్రామస్థులు, ఎస్ఐ జగదీశ్వర్ కథనం ప్రకారం... అదే గ్రామానికి చెందిన మండ్ల లక్ష్మయ్య నాటు తుపాకీతో ఎత్తం మాజీ సర్పంచు మిద్దె కృష్ణయ్యను హత్య చేయడానికి పథకం వేస్తున్నాడు. అందులో భాగంగానే నాటు తుపాకీని ఉపయోగించాలని తెచ్చుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మాజీ సర్పంచు కృష్ణయ్యను విచారించగా, నాటు తుపాకీ దొరికిందని తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని మాజీ సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

అన్నదాతల అగచాట్లు

» నవాబ్‌పేటలో ఎరువుల వ్యాపారుల వింత పోకడ



సింగిల్ విండో కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు (ఫైల్)

నవాబ్‌పేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది అన్నదాతల పరిస్థితి. అవును ఇది జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో నవాబ్‌పేట మండలంలో జరుగుతున్న తీరిది. అధికారులు అన్నదాతలకు ఎరువుల కొరత రావొద్దన్న ఉద్దేశంతో నిల్వలు ఉంచిన క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మొదట్లో రైతులు మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేశారు. అయితే ఇటీవల యూరియా అవసరాలు పెరగడంతో రైతులు గంటల తరబడి మండల కేంద్రంలోని సహకార బ్యాంకు కార్యాలయం ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గంటల తరబడి పడిగాపులు కాయడంతో వారి అవసరం గుర్తించిన మండల వ్యవసాయ అధికారి కృష్ణ కిషోర్ యూరియా తీసుకువచ్చి రైతులకు సరఫరా చేయించారు. ఇటీవల అవసరాలు తగ్గడంతో వ్యాపారులు, ఆగ్రోస్, గ్రోమోర్ కేంద్రాలతో పాటు అమ్మాపూర్, చౌడూర్, కొల్లూర్ తదితర చోట్ల యూరియా నిల్వలు ఏర్పాటు చేయించారు. అయితే కొందరు వ్యాపారులు నిల్వలు పెట్టుకుని స్టాక్ లేదని చెబుతుండటంతో వివిధ గ్రామాల నుంచి రైతులు మండల కేంద్రానికి నిత్యం యూరియా కోసం వచ్చిపోతున్నారు. అయితే జూన్ మాసంలో తమవద్ద విత్తనాలు, ఎరువులు, ఇతర మందులు కొనుగోలు చేసిన రైతులకే యూరియా ఇస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై మండల ఏవో కృష్ణ కిషోర్‌ను వివరణ కోరగా ప్రస్తుతం యూరియా అవసరాలు తగ్గడం వల్ల స్టాకు తీసుకురాలేదని ఉన్నతాదికారుల ఆదేశాలతో త్వరలో అవసరమైన యూరియా తీసుకువస్తాం. అయితే నిల్వలు పెట్టుకుని రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే శనివారం సాయంత్రం సింగిల్ విండో కార్యాలయాని ఓ లారి యూరియా పంపినట్లు ఆయన తెలిపారు.

హైదరాబాద్ వెళ్లే బస్సు కోసం


నర్వ ప్రజల పడిగాపులు



బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

నర్వ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నర్వ మండల కేంద్రం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు నేరుగా బస్సు సదుపాయం లేక స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. వైద్య అవసరాలు, విద్యా, ఉద్యోగాలు, వ్యక్తిగత పనుల కోసం ప్రతి రోజు పలువురు హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుంది. అయితే నేరుగా వెళ్లే బస్సు లేకపోవడంతో మక్తల్, మహబూబ్ నగర్ లేదా జడ్చర్ల వరకు వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరే బస్సులు ఎక్కాల్సి వస్తోంది. ప్రజలు చెబుతున్నదేమిటంటే ఈ మార్గంలో కనీసం ఉదయం, సాయంత్రం అయినా నేరుగా బస్సులు నడిపిస్తే సమయం, ఖర్చు రెండు ఆదా అవుతాయి. ప్రస్తుతం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారుతూ ప్రయాణం చేయడం వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో ఉన్న తల్లిదండ్రులు, విద్యార్థులకు చాలా కష్టమైపోతుంది. ఇంకా సమస్య ఏమిటంటే మక్తల్ లేదా మహబూబ్ నగర్ నుంచి వచ్చే బస్సులు కూడా తరచుగా ఆలస్యంగా వస్తున్నాయి. దాంతో కొన్నిసార్లు హైదరాబాద్‌లోని పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. స్థానిక ప్రజలు, వ్యాపారులు, విద్యార్థి సంఘాలు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. నర్వ నుంచి హైదరాబాద్ వరకు నేరుగా బస్సు ప్రారంభిస్తే ఈ ప్రాంత ప్రజలతో పాటు సమీప గ్రామాల వారికి ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొంటున్నారు.

దారితప్పుతోన్న బాల్యం



» బాలికలపై అఘాయిత్యాలు
» సామాజిక మాధ్యమాలతో పెడదారిన బాలురు

జడ్చర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బాల్యం దారితప్పుతోంది... ఆడిపాడుకుంటూ చదువుకోవాల్సిన బాల్యం బుద్ధి మారుతోంది... చదువుకంటే అధిక సమయాన్ని సెల్‌ఫోన్ చూడటానికే వెచ్చిస్తున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం, వివిధ రకాల సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న వీడియోలు ఇతర వీడియోలను వీక్షిస్తున్న బాల్యం ఆలోచన విధానం మారిపోతోంది. సాంకేతిక విజ్ఞానాన్ని తమ భవిష్యత్ కోసం వినియోగించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా వినియోగిస్తున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేనికారణంగా చెడు అలవాట్ల బారిన పడుతున్నారు. ఏమి చేస్తున్నామో తెలియని వయస్సులో అఘాయిత్యాలకు పాల్పడుతూ మైనర్ బాలురు దారి తప్పుతున్నారు. వీరితో పాటు మైనర్ బాలికలపై కామ పిశాచాలు లైంగిక దాడులకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

● జడ్చర్ల మునిసిపాలిటీలోని ఓ కాలనీలో గత నెలలో 8 సంవత్సరాల బాలికపై ఐదుగురు మైనర్ బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. వీరిలో సదరు బాలిక సోదరుడు సైతం ఉండటం గమనార్హం. ఐదుగురు మైనర్‌లలో నలుగురు 12 నుంచి 14 సంవత్సరాల వయస్సు, ఒకరు 16 సంవత్సరాల బాలుడు ఉన్నారు. ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటున్న బాలికపై ఐదుగురు మైనర్ బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. మూడు రోజుల తర్వాత బాధిత బాలిక కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అత్యాచారానికి గురయ్యిందని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వైద్యులు గుర్తించనంత వరకు బాధిత బాలికతో పాటు మైనర్ బాలురకు సైతం తాము ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడ్డారో గుర్తించలేని పరిస్థితిలో ఉన్నారు.

● జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో 8 సంవత్సరాల బాలికను ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన బాలుడు అత్యాచారాని కి పాల్పడ్డాడు. వారం రోజుల తర్వాత బాధిత బాలిక అస్వస్థతకు గురయ్యింది. చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లిన అనంతరం అత్యాచారానికి గురయినట్లుగా వైద్యు లు గుర్తించారు.

● మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ కాలనీలో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న 8 సంవత్సరాల బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. చాక్‌లెట్ ఇచ్చి సదరు చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. తన కుమార్తె కనిపించడకపోవడంతో వెదుకు తుండగా బాలికపై లైంగికదాడికి పాల్ప డుతున్న వృద్ధుడిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.

● మహబూబ్‌నగర్ పట్టణ శివారులోని ఓ కాలనీలో ఉన్న పార్కులో ఆడుకుంటున్న బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు గమనించి సదరు యువకుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

● జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని ఓ కాలనీలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మూడేళ్ల బాలికపై 15 సంవత్సరాల బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బాలిక తల్లి తన కుమార్తెను రక్షించి, సదరు బాలుడికి దేహశుద్ధి చేసింది.

ఇలాంటి కొన్ని సంఘటనలలో వివిధ సామాజిక మాధ్యమాలలో వస్తున్న వీడియోలు చూసి ప్రేరేపితమైన బాలురు ఉన్నారు. నివసిస్తున్న ఇంటి వాతావరణంతో పాటు తాము ఏమి చేస్తున్నామో పిల్లలు గమనించకుండా ఉండటం గమనార్హం. మైనర్ బాలురలలో వస్తున్న ఈ విపరీతమైన పోకడకు అడ్డుకట్ట వేసేవిధంగా సమాజం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

15 ఏళ్లుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల వెతలు

» క్రమబద్ధీకరణ కోసం సమ్మె చేసినా దక్కని ఫలితం
» ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారలేదని ఉద్యోగుల ఆవేదన
» జిల్లాలో వివిధ విభాగాల్లో 433 మంది ఎస్ఎస్ ఉద్యోగులు

గద్వాల సర్కిల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా సమగ్ర శిక్ష ఉద్యోగుల తలరాతలు మారడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమస్యలు గట్టెక్కుతాయని గంపెడు ఆశలతో చాలీచాలని జీతంతో జీవనం సాగించినా ప్రభుత్వమే మారిందే తప్పా వారి కష్టాలకు నియంత్రణే లేకుండా పోయింది. మీకు మేమున్నామంటూ భరోసా ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాత్సారం చేస్తోందన్న ఆరోపణలు మూటకట్టుకుంది.. ఇలా 15 ఏళ్లుగా ఆర్థిక భారంతోనే విధులు నెట్టుకొస్తున్న ఆ ఉద్యోగులు చట్టబద్ధమైన న్యాయమార్గంలో తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్నీ బెనిఫిట్స్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 29 రోజుల పాటు నిరవధిక సమ్మెకు దిగారు. వివిధ విభాగాల్లో పని చేసే సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెతో ఎక్కడికక్కడ విద్యాశాఖలో కీలక పనులు స్తంభించిపోవడంతో సానుకూల స్పందనతో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో తీపి కబురు అందిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెకు బ్రేక్ వేశారు. కానీ రోజులు...నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలకు పరిష్కారం దొరకకపోవడంతో దయనీయ జీవన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు సమగ్ర శిక్ష ఉద్యోగులు..



కృష్ణవేణిచౌరస్తాలో మానవహారం నిర్వహిస్తున్న ఎస్ఎస్ ఉద్యోగులు (ఫైల్)

జిల్లాలో 433 మంది ఎస్ఎస్ ఉద్యోగులు...

జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల్లో పని చేసే సమగ్ర శిక్ష (ఎస్ఎస్) ఉద్యోగులు 433 మంది ఉన్నారు. వారిలో డీపీవోలో 9 మంది, ఎమ్మార్సీలో 55 మంది, సీఆర్పీలు 30 మంది, పీటీఐలు 75 మంది, కేజీబీవీలో 250 మంది, యూఆర్ఎస్‌లో 14 మంది విధులు నిర్వహిస్తున్నారు.

విద్యాశాఖలో ముఖ్య భూమిక ఎస్ఎస్ ఉద్యోగులది...

విద్యాశాఖలో పలు సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తిస్థాయిలో అమలు పరిచే విషయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల పాత్ర చాలా ప్రధానంగా ఉంటుంది. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, యూడైస్, మధ్యాహ్న భోజన నిర్వహణ అమలు తీరు, ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు నమోదు అంశాలు, ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం తదితర పనులు ఎస్ఎస్ ఉద్యోగులు నిర్వహిస్తున్నారు.

ఎస్ఎస్ పరిధిలోకి వచ్చే ఉద్యోగులు వీరే...

గురుకుల విద్యాలయాల్లో విధులు నిర్వహించే సీఆర్టీలు, పీజీసీఆర్టీలు, బోధనేతర సిబ్బంది, కేజీబీవీలలో ప్రత్యేకాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, కంప్యూటర్ శిక్షకులు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, వ్యాయమ ఒకేషనల్ ఉపాధ్యాయులు, వాచ్‌మెన్‌లు సమగ్ర శిక్ష పరిధి కిందికి వస్తారు. అలాగే, జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టం ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్‌లు, డీఎల్ఎంటీ మెస్సెంజర్లు, ఆదర్శ పాఠశాలల వార్డెన్‌లు, ఆపరేటర్లు, కేర్ టేకర్స్, ప్రభుత్వ పాఠశాలలోని క్రాఫ్ట్ ఆర్ట్, పీటీఐ తదితర సిబ్బంది కూడా వస్తారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ధీటుగా విధుల నిర్వహణ...

ప్రభుత్వ ఉద్యోగులకు ఏమాత్రం తగ్గకుండా వారికి ధీటుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ విధులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖలో పలు విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని నివేదిక రూపంలో జిల్లా, రాష్ట్ర అధికారులకు ఎప్పటికపుడు చేరవేయడంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమ కీరోల్‌ను ప్రదర్శిస్తుంటారు.

రెగ్యులరైజ్‌తో పాటు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి



ఏళ్ల తరబడి తామెదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంతో పాటు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి. తాము పడే కష్టాలకు తగ్గట్టుగా జీతనాలు లేకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే అన్నీ రకాల బెనిఫిట్స్ అందించాలి.

- హుసేనప్ప, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు, గద్వాల

ఆర్థిక భారం నుంచి విముక్తి కలిగించాలి



గత 15 ఏళ్ల నుంచి అరకొర జీతంతో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను ఆర్థిక భారంగా నుంచి రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కలిగించాలి. 29 రోజుల సమ్మె వేతనాన్ని వెంటనే చెల్లించాలి. న్యాయపరంగా తమ విధులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

- గోపాల్, ఎస్ఎస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి, గద్వాల

పే స్కేల్ ఊసే లేదు...

సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది డిసెంబర్ 6వ తేదీ ఈ ఏడాది జనవరి 7వ తేదీ వరకు 29 రోజుల పాటు ఎస్ఎస్ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. అయితే ప్రభుత్వం మూడు నెలల్లోగా మంత్రి వర్గ ఉపసంఘ సమావేశం ఏర్పాటు చేసి అపరిష్కృత సమస్యల పరిష్కారంతో పాటు పే స్కేల్ అమలు చేస్తామని భరోసా ఇవ్వడంతో మరోదారి లేక ఉద్యోగులు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. కానీ నెలలు గడుస్తున్నా పే స్కేల్ ఊసే లేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

» సంగంబండ రెండు గేట్ల ఎత్తివేత
» గద్వాలలో దంచికొట్టిన వర్షం

మహబూబ్‌నగర్/నారాయణపేట/గద్వాల/నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి టౌన్/అలంపూరుచౌరస్తా ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రెండ్రోజుల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరించడం.. భారీ వర్షాల జాబితాలో మహబూబ్‌నగర్ కూడా ఉండటంతో అధికార యంత్రాంగమంతా అప్రమత్తమైంది. ప్రజలనూ అలర్ట్ చేశారు. శుక్రవారం రాత్రి ఉమ్మడి జిల్లాలో మోస్తరు వానలే కురవగా, శనివారం తెల్లవారుజామున కొన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పట్టపగలే చీకటిని తలపించేలా కారుమబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షం కురుస్తుందని జనం ఆఘమేఘాల ఇళ్లకు చేరుకున్నారు. అయితే ముసురువాన మాత్రమే కురిసింది.

● నారాయణపేట జిల్లా మక్తల్, కృష్ణ, మాగనూర్ మండలాల్లో వాగులు పొంగి పోర్లాయి. కృష్ణ మండలం హిందూపూర్ సమీపంలో గుర్రపు వాగు ఉధృతంగా పారడంతో పరిసరాల్లో ఉన్న పత్తి, వరి పంటల్లోకి నీరు చేరి కోతకు గురై పంటకు నష్టం వాటిల్లింది. మక్తల్ మండలం గుర్లపల్లి నుంచి మంథన్‌గోడ్ గ్రామాల మధ్య వాగు ప్రవాహంతో వాహనరాకపోకలు స్తంభించాయి. మక్తల్ పడమటి ఆంజనేయ స్వామి అలయం ముందు వర్షం నీరు నిలిచి భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. సంగంబండ రిజర్వాయర్ రెండు గేట్లను తెరిచి నీటిని విడుదల చేశారు.

● గద్వాల జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లి పొలాల్లోకి నీళ్లు చేరాయి. పత్తి పంటలు నీట మునిగాయి. జూలకల్లు వద్ద కర్నూల్- రాయిచూర్ అంతర్ రాష్ట్ర రోడ్డుపై నీళ్లు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఎవరినీ రోడ్డు దాటనీయలేదు. జంట గ్రామాలైన మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గార్లపాడు-సాసనూలు-శేక్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న మూడు వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మానవపాడు, ఇటిక్యాల మండల కేంద్రానికి చేరుకునే రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా నీళ్లు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక అయిజలో కురిసిన భారీ వర్షానికి గాజులపేటలోని ఇళ్లకు నీళ్లు చేరాయి. అయిజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వర్షపు నీటిలో జలదిగ్బంధం అయ్యింది. గద్వాల పట్టణంలో ఒక ఇల్లు కూలగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్లు జలదిగ్బంధం కాగా మునిసిపల్ సిబ్బంది స్పందించి త్వరలో వెళ్లే విధంగా కృషి చేశారు. ఎగువన కురిసిన వర్షాలకు బొంకూరు వాగు పొంగి సమీపంలో ఉన్న పంట పొలాలను ముంచెత్తింది. గ్రామానికి చెందిన మద్దిలేటి, రాముడు, లక్ష్మన్న, డానియేల్, వెంకట్రాముడు, కురువసంజన్న, నరసింహులు తదితర రైతులకు చెందిన పొలాలు వరద ఉధృతికి దెబ్బతిన్నాయి. ఇదే వంక మెన్నిపాడు గ్రామానికి వెళ్లే దారిని దాటి తుంగభద్రనదిలో కలుస్తుంది. లోవంతెన కారణంగా బ్రిడ్జిపై నుంచి వరదపారడంతో మెన్నిపాడు గ్రామానికి 8గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.



అలుగుపారుతున్న చిన్నపొర్ల గ్రామ చెరువు



అంతరాష్ట్ర రహదారిపైనుంచి నీళ్లు పారడంతో రాకపోకలు నిలిపిన పోలీసులు

వనపర్తి, గోపాల్‌పేట మండలంలో 96.2 మి.మీ వర్షపాతం

నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 93.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఊట్కూర్ మండలంలో 91.8, నారాయణపేట మండలంలో 67, దామరగిద్ద మండలంలో 62, మాగనూర్ మండలంలో 57, నర్వ మండలంలో 30.8, మద్దూర్ మండలంలో 26.8, మరికల్ మండలంలో 20.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో శనివారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. రోడ్లు, పొలాలు జలమయం అయ్యాయి. వర్షాకాలం ప్రారంభం తర్వాత ఇంత పెద్ద వర్షం కురువడం ఇదే మొదటి సారి. జిల్లాలో అత్యధికంగా ఇటిక్యాలలో 67.2 మిల్లీ మీటర్లు, అయిజలో 65.4, గద్వాలలో 57.4, గట్టులో 51.6 మి.మీ వర్షం కురిసింది. అదేవిదంగా మానవపాడులో 43.2, ఉండవెల్లిలో 41.8, మల్దకల్‌లో 34.8, వడ్డేపల్లిలో 32, కేటీదొడ్డిలో 22.8, రాజోలిలో 22.4 మి.మీ వర్షం కురిసింది.

● నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలంలో 62.2 మిల్లీమీటర్ల వర్షం కురువగా బిజినేపల్లిలో 47.6, తెల్కపల్లిలో 34.6, పెద్దకొత్తపల్లిలో 32.8, నాగర్‌కర్నూల్‌లో 25.4, తాడూరులో 21.0 మి.మీ. వర్షం కురిసింది.

● మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలో 32.9 మీ.మీ., సీసీకుంటలో 15.9, మహ్మదాబాద్‌లో 15.5, భూత్పూర్‌లో 16.9, కోయిలకొండలో 14.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పొలాల్లోకి నీళ్లు..

పెబ్బేరు రూరల్/పెద్దకొత్తపల్లి/బ్రహ్మగిరి/ చిన్నచింతకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో వరి పంటలు నీటిలో మునిగిపోయాయి. పంట గెట్లు తెగిపోయాయి. శ్రీరంగాపురం రంగసముద్రం అలుగునీటి ప్రవాహానికి శేరుపల్లి గ్రామానికి చెందిన కొందరి రైతుల వరి పంట దాదాపు ముప్పై ఎరకాల్లో నీట మునిగి దెబ్బతిన్నాయి. పెబ్బేరు మండలంలో తిప్పాయిపల్లి, పెంచికలపాడు, అయ్యవారిపల్లి, జనుంపల్లి, సుగూర్ గ్రామాల్లో భారీ వర్షానికి వరి పంటలపై ఇసుక మేటలు పెట్టి నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పెద్దకొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం, శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దేవునితిర్మలాపూర్, పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, వెన్నచెర్ల, నక్కలపల్లి తదితర గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. వరి పైర్లు నీట మునిగాయి. పొలం గట్లు తెగిపోవడంతో వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

నల్లమలలో..

నల్లమల అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పారుతున్నాయి. అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలోని కొల్లంపెంట, కొమ్మెనపెంట, మల్లాపూర్, పుల్లాయపల్లి, పర్హాబాద్, గుండం, వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి, కాయిలేటిపెంట, తాటి గుండాల అక్కమహాదేవి గుహలు, శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

● రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పర్దీపూర్ రిజర్వాయర్ ద్వారా వచ్చిన నీటితో చిన్నచింతకుంట చెరువు నిండుకుండలా మారింది. దీంతో శనివారం ఉదయం చెరువు అలుగు పారి, గొలుసుకట్టు కాలువ గుండా మద్దూరు చెరువుకు వెళ్లే కాలువ కొంతవరకు దెబ్బతినింది. కాలువ చెరువు నీరు వెళ్లేంతగా కెపాసిటీ లేనికారణంగానూ, అలాగే చిన్నగా ఉండటంతో నీరు ఒక్కసారిగా సమీపంలోని వరి పంటలను ముంచెత్తింది.



పత్తి చేనులో నిలిచిన వరద నీరు



పెద్దకొత్తపల్లి శివారులో నీట మునిగిన వరి పైరు

కొనసాగుతున్న దుందుభీ ప్రవాహం

» సిర్సవాడ వద్ద కల్వకుర్తి, మిడ్జిల్ వైపు నిలిచిన రాకపోకలు




పాపగల్ గ్రామం వద్ద దుందుభీలో వరద ఉధృతి

తాడూరు/ఉప్పునుంతల/చిన్నచింతకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దుందుభీ నది జోరుగా ప్రవహిస్తోంది. శనివారం సైతం మండలంలోని సిర్సవాడ గ్రామం వద్ద దుందుభీ నది ప్రవాహం ఏమాత్రం తగ్గలేదు. వ్యవసాయ పనులు, గీతా కార్మికులు దుందుభీ నది దాటేందు కోసం 40కిలో మీటర్లు ప్రయాణించి వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొన్నది. ముఖ్యంగా సిర్సవాడ గ్రామం నుంచి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ మండలాల వైపు వెళ్లే ముఖ్యమైన లింకు రోడ్డు కావడంతో కాజ్‌వేపై నుంచి వరద ఉధృతి ఎక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. నది పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు ఎవరూ దుందుభీ దాటేందుకు ప్రయత్నించవద్దని ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

● ఉప్పునుంతల- వంగూర్ సరిహద్దులోని దుందుభీ వాగులో ఉన్న మొల్గర- ఉల్పర కాజ్‌వే ఇటీవల వర్షాలకు శనివారం కాజ్‌వే ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. ప్రయాణికులు కాజ్‌వేపై రాకపోకలు కొనసాగించొద్దని ఎస్సై వెంకటరెడ్డి తెలిపారు.

ఊకచెట్టు వాగుకు జలకళ



అలుగు పారుతున్న ఏదులాపూర్ చెక్‌డ్యాం

గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాకు కురుస్తున్నాయి. దేవరకద్ర నియోజకరవ్గంలోని చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల్లో ఊక చెట్టువాగుకు కలకళ సంతరించుకున్నది. దాంతో రిజర్వాయర్ అలుగు పారటంతో, దిగువన గల మన్నెవాగు ద్వారా కాలువగుండా చిన్నచింతకుంట చెరువుకు నీరు చేరింది.

అలుగు పారుతున్న మల్లెపల్లి, చిన్నపొర్ల చెరువులు..

ఊట్కూర్/మక్తల్, (ఆంధ్రజ్యోతి): వర్షానికి చెరువులు, వాగులు , కుంటల్లో నీరు వచ్చి చేరాయి. మండలంలోని మల్లెపల్లి, ముక్కన్న చెరువు, చిన్నపొర్ల, ఎర్రకుంట, చిన్నపొర్ల ఊర చెరువులు ఉధృతంగా అలుగుపారుతున్నాయి. ఊట్కూర్ గ్రామంలోని పాతపేట వీధిలో బెస్త గోవిందుకు చెందిన మట్టి ఇల్లు కూలిపడింది.

● మక్తల్ పట్టణం, పరిసర గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కర్ని మక్తల్ రహదారిపై చెరువునీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే గోలపల్లి, మంథన్‌గోడ్ మధ్యన బ్రిడ్జి వద్ద భారీగా నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురియడంతో పట్టణంలోని పలు కాలనీల్లో వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూసాపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి అదుపు తప్పి కాంక్రిట్ సిమెంట్ దిమ్మెను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన మూసాపేట వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు.. మండలంలోని వేముల గ్రామానికి చెందిన కమ్మరి సీతారాములు, సంగు వెంకటయ్య ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్ వెళ్లి అక్కడ సంగు వెంకటయ్యకు సంబంధించిన కరెంట్ మోటార్‌ను రిపేర్ చేసుకుని తిరిగి వేముల గ్రామానికి వెళ్తున్నారు. జాతీయ రహదారి మూసాపేట వద్దకు రాగానే రోడ్డు పనుల వలన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెకు బైకు వెనకివైపు ఉన్న వ్యక్తి మోకాలు తగిలికింద పోయాడు. దీంతో సంగు వెంకటయ్య(65)కు తీవ్ర గాయాలై మృతి చెందాడు. బైకు అజాగ్రత్త, అతివేగంగా నడిపించడంతోనే ప్రమాదం జరిగి వ్యక్తి మృతి చెందాడని, బాధితుల ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముల్కలపల్లి వేణు తెలిపారు. మృతుడి భార్య రెండేళ్ల కిందట మృతి చెందింది. ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

గద్వాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి సుజాత (48)అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, రూరల్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సుజాత దంపతులకు ముగ్గురు పిల్లలు. వారికి పెళ్లిళ్లు అయ్యాయి. అదేస్థాయిలో ఆర్థిక ఇబ్బందులు, అప్పులు అయ్యాయి. తరచూ భార్యాభర్తల మధ్య వివాదం జరిగేది. మూడు రోజుల క్రితం కూడా ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగి మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో సుజాత శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుంది. కిరాణ, హోటల్ నడిపే ఈశ్వర్‌రెడ్డి కొట్టు మూసివేసిన తర్వాత ఇంట్లో ఉరివేసుకొని ఉన్న భార్యను చూసి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందింది. శనివారం కుమారుడు సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

భూత్పూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి తల పగిలి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శనివారం తెల్లవారు జామున మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 44 జాతీయ రహదారి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా, భారత్ పెట్రోల్ బంక్ దగ్గర వ్యక్తిని ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి తల పూర్తిగా నుజ్జు-నుజ్జు అయ్యి అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని పోస్టుమార్టు మార్చురీలో భద్రపర్చినట్లుగా తెలిపారు. ఎవరైన మృతుడికి సంబంధించిన వారు ఉంటే భూత్పూర్ పోలీస్ స్టేషన్‌కు సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

దొంగల హల్‌చల్

- తాళం విరగ్గొట్టి 15తులాల బంగారు నగలు, 2 లక్షల నగదు చోరీ

అచ్చంపేటటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తాళం విరగ్గొట్టి 15తులాల బంగారు నగలు, రెండు లక్షల నగదు చోరీకి పాల్పడిన ఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని శ్రీనివాస్ కాలనీకి చెందిన మేకల నిర్మల ఇంటికి తాళం వేసి ఈ నెల 7వ తేదీన ఉప్పునుంతలకు పనిమీద వెళ్లింది. శనివారం వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో బీరువాలోని 15 తులాల బంగారు నగలు, 2 లక్షల నగదు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

మాగనూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి పిడుగు పడి రైతు కర్రెతాయప్పల బాలప్పకు చెందిన ఎద్దు మృతి చెందింది. బాలప్ప పొలం వద్ద కట్టేసిన ఎద్దుపై పిడిగు పడింది. ఎద్దు విలువ సుమారు 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వివిధ పార్టీల నాయకులు కోరారు.

యువతి మిస్సింగ్ కేసు నమోదు

వనపర్తి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యువతి మిస్సింగ్ కేసు నమోదు అయిన ఘటన వనపర్తి పట్టణ పరిధిలోని శ్రీనివాసపురం బోనమ్మ తండాలో శనివారం చోటు చేసుకుంది. అదే తండాకు చెందిన అంగోతు సిరేలి నాగర్‌కర్నూల్‌లో ఎగ్జామ్ ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తున్నది. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ రామచంద్రయ్య తెలిపారు.

పోలీసుల చెంతన చిన్నారి



తప్పిపోయి పోలీసుల వద్ద ఉన్న తనిక్ష

వనపర్తి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్ టౌన్ చర్చి సమీపంలో తప్పిపోయిన చిన్నారిని శనివారం పోలీసులు గుర్తించారు. అదే ప్రాంతంలో ఓ చిన్నారి ఏడుస్తూ ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ చిన్నారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి వివరాలు సేకరించారు. ఆ చిన్నారి(తనిక్ష) తల్లిదండ్రులు రమ్య, కృష్ణతో పాటు ఒక అన్న ఉన్నాడు అని చెబుతున్నది. నోటి నుంచి సక్రమంగా మాటలు రావడం లేదని, ఈ పాపను గుర్తిస్తే వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

శరవేగంగా డబుల్ రహదారి పనులు



చురుకుగా సాగుతున్న నవాబ్‌పేట కుత్నపల్లి రహదారి పనులు

నవాబ్‌పేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రం నుంచి రాజాపూర్ మండలం కుత్నపల్లి శివారు వరకు ఉన్న డబుల్ రహదారి పనులు చురుకుగా సాగుతున్నాయి. గత ఆరు నెలల క్రితం రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ అరుణతో కలిసి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, పనులు ఆలస్యం అవుతాయని అందరు భావించారు. కానీ శరవేగంగా పనులు ప్రారంభించి రహదారుల పనులు పూర్తి కావొచ్చాయి. ప్రస్తుతం బీటీ పనులు కొనసాగుతుండటంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి పూర్తి అయితే ఇటు హైదరాబాద్, అటు మహబూబ్‌నగర్‌కు దూరం తగ్గే అవకాశం ఉంది. అలాగే పోలేపల్లి నుంచి కారూర్ మీదుగా యన్మనగండ్ల గేట్ వరకు ఉన్న రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిసింది. ఈ రెండు రహదారులతో పాటు రుద్రారం, కొండాపూర్ నవాబ్‌పేట, అలాగే నవాబ్‌పేట నుంచి కామారం, పోమాల్, కేశవరావ్‌పల్లి మీదుగా డబుల్ రహదారి నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

వంతెనలిలా.. వెళ్లేదెలా..

- నేల బ్రిడ్జిల వద్ద రాకపోకలకు అంతరాయం
- అంతర్రాష్ట్ర రహదారిపై ఆగిపోతున్న ప్రయాణం
- అలంపూర్ నియోజకవర్గానికి రూ.70 కోట్ల నిధులు అవసరం
- మధ్యలోనే ఆగిపోయిన గార్లపాడు బ్రిడ్జి
- ఆరేళ్లుగా సా..గుతున్న పోలోని వాగు బ్రిడ్జి నిర్మాణం

వరదొస్తే ప్రయాణ కష్టాలు



ఉండవల్లి మండలం, మెన్నిపాడు గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా పారుతున్న వంతెనపై ఎవరూ వెళ్లకుండా కాపలా కాస్తున్న కార్మికులు

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో వర్షం వస్తే ఊరు దాటలేని పరిస్థితి చాలా గ్రామాల్లో ఉంది. ఎప్పుడో 60 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలపైనే నేటికీ ప్రమాదకర స్థితిలో ప్రయాణించాల్సి వస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 255 గ్రామాలున్నాయి. ఇందులో సుమారు 150 గ్రామాల ప్రజలు వెళ్లాలన్నా రావాలన్నా వంతెనలను దాటాల్సి ఉంటుంది. ఇందులో చాలా వంతెనలు శిథిల స్థితికి చేరుకున్నాయి. మరికొన్ని నేల వంతెనలు కావడంతో కొద్దిపాటి వర్షాలకే పైనుంచి పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఒక్క అలంపూర్ నియోజకవర్గంలోనే ప్రమాదకర పలు వంతెనలకు సుమారు 70కోట్లకు గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం విడుదలకు నోచుకోలేదని తెలుస్తోంది.

ఏళ్లుగా డిమాండ్లు

ఇటిక్యాల మండలం, రాజశ్రీ గార్లపాడు గ్రామం నుంచి వర్షం కురిసిన ప్రతీసారి ఎర్రవల్లికి రావాలంటే గ్రామస్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటేవారు. సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిన నేల వంతెన కష్టాలను మాజీ ఎమ్మెల్యే అబ్రహం చొరవ తీసుకుని హైలెవల్ వంతెన కోసం రూ. 2 కోట్ల పైచిలుకు నిధులను మంజూరు చేయించారు. రెండేళ్ల కిందట పనులు ప్రారంభమైనా వివిధ కారణాల చేత ఎర్త్‌వర్క్‌లతోనే నిలిచిపోయాయి. ఇదే మండలం, షేక్‌పల్లి పెద్దవాగు వద్ద నేలవంతెన చిన్నపాటి వర్షాలకే ప్రమాదకరంగా ప్రవహిస్తుంటుంది. దీంతో దాదాపు పది గ్రామాల ప్రజలు ధర్మవరం మీదుగా హైవేపై మండల కేంద్రానికి, గద్వాలకు చేరుకోవాల్సిన పరిస్థితి. ఇదే మండలం సాతర్ల గ్రామానికి సమీపంలో కూడా ఇదే పరిస్థితి. అయిజ-పులికల్ మధ్య పోలోని వాగు 6ఏళ్ల క్రితం నిర్మాణం ప్రారంభమైనా నేటికీ పూర్తికాలేదు. ఉత్తనూరు టు అయిజ, తొత్తినోనిదొడ్డి టు అయిజ మధ్య గత 20 ఏళ్లుగా వంతెన డిమాండ్ ఉంది. అయిజ టు దేవబండ వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మించాలని దాదాపు 40ఏళ్లుగా డిమాండ్ ఉంది. మానవపాడు-అమరవాయి మధ్య, పెద్దఆముదాలపాడు-అమరవాయి మధ్య, కలుకుంట-అమరవాయి మధ్య, ఉండవల్లి మండలంలో బస్వా పురం-భైరాపురం మధ్య, మారమునగాల-ప్రాగటూరు మధ్య, ఉండవల్లి-చిన్నఆముదాలపాడు మధ్యలో వంతెనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి చోట్ల ప్రమాదాలు జరగకుండా ప్రతీ వర్షకాలం పోలీసు అధికారులు తమ సిబ్బందిని ఉంచి గస్తీలు నిర్వహించాల్సి వస్తుంది.

వానొస్తే అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణానికి బ్రేక్..!

జిల్లాలో ప్రధాన అంతర్రాష్ట్ర రహదారి కర్ణాటక, తెలంగాణలను కలిపే ఎరిగెర రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అలంపూర్ చౌరస్తా నుంచి తెలంగాణ సరిహద్దు ఎరిగెర వరకు డబుల్ రోడ్డుతో పాటు వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నది. అయిజ వరకు రోడ్డు పనులు పూర్తి చేసినా అయిజ సమీపంలో ఉన్న పెద్దవాగుపై, ఇదే రోడ్డుపై పర్థిపూర్ సమీపంలో మినీ వంతెన, జులెకల్ వద్ద వంతెనలు నిర్మించలేదు. దీంతో గతేడాది కురిసిన వర్షాలకు ఒక రాత్రంతా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ప్రయాణికులు చిన్నపిల్లలతో నానా యాతన పడ్డారు.

కనీస వంతెన లేదు

రాజోలి మండలం, ముండ్లదిన్నె, పెద్దతాండ్రపాడు గ్రామాల నుంచి మండల కేంద్రానికి, వ్యవసాయ పొలాలకు రావాలంటే తుమ్మలవాగులో దిగి రావాల్సిందే. ఇక వర్షం కురిస్తే వాగు అత్యంత ప్రమాదకరంగా పారుతుంది. దీంతో వెంకటాపురం మీదుగా సుమారు 20కి.మీ. దూరం ప్రయాణించి రాజోలికి చేరుకోవాల్సి ఉంటుంది. కనీస వంతెన లేక ఇబ్బందులు పడుతున్నామని సదరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉండవల్లి మండలంలోని మెన్నిపాడు- కలుగొట్ల గ్రామాల మధ్య బస్వాపురం, చిన్నఆముదాలపాడు, మారమునగాల, గ్రామాల ప్రజలు వాగులొస్తే మండల కేంద్రానికి రాలేకపోతున్నారు. భైరాపురంలో ఇళ్ల మధ్యన వాగు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండటం వల్ల ఇక్కడ వంతెన అత్యవసరం.

పదేళ్లలో 20 వేల మందికి నైపుణ్య శిక్షణే లక్ష్యం

- అమర్‌రాజా సహకారంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ
- అమర్‌రాజా కంపెనీలో వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పాలమూరు రానున్న పదేళ్లలో 20 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే పలు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో పలు రకాల కోర్సులకు శిక్షణ ఇప్పించామని చెప్పారు. శనివారం మహబూబ్‌నగర్ నగరం పరిధిలోని దివిటిపల్లి ఐటీ టవర్‌లో అమర్‌రాజా కంపెనీ సహకారంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను ఎమ్మెల్యే ప్రారంభించారు. మూడు నెలల పాటు ఇక్కడ నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే 3వ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అమర్‌రాజా కంపెనీ సహకారంతో జిల్లాలోని వేలమంది కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. స్థానికులకు ఐటీ కంపెనీలో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహబూబ్‌నగర్ యువతకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మూడునెలల పాటు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తారన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, రాజన్న ఫౌండేషన్ డైరెక్టర్ జయకృష్ణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తీజ్ వేడుకలు



మొలకల తొట్లతో ఉరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

మిడ్జిల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వేముల గ్రామ పంచాయతీ తమ్మడకుంటతండాలో శనివారం తీజ్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిది రోజులు ఉపవాసంతో ఉండి నీళ్లు పోసి మొలకెత్తిన మొలకల తొట్లతో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మేరామాయాడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి నిమజ్జనం చేయడం జరుగుతుందన్నారు. తీజ్ వేడుకల సందర్భంగా తండాలో పెద్దఎత్తున మహిళలు, గిరిజనులు ఊరేగింపు నిర్వహించి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌రాథోడ్, బీఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌పవర్, తీజ్ ఉత్సవ కమిటీ నాయకులు దుధ్య నాయక్, రాజునాయక్, శ్రీనునాయక్, మల్లేష్‌నాయక్, చందునాయక్, వంశీనాయక్‌తో పాటు పలువురు తండావాసులు తదితరులున్నారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం



అమరగిరిలో నిర్వహిస్తున్న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం

- తెలంగాణ గిరిజన సంఘం నాయకుల పిలుపు
- అమరగిరిలో ఘనంగా ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం

కొల్లాపూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆదివాసి హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం అని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి గ్రామంలో తెలంగాణ గిరిజన సంఘం జెండాను గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకుడు దశరథం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం స్ఫూర్తితో వాటిని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన తెగల మధ్య చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు.

అమరగిరి గ్రామంలో చెంచు కుటుంబాలు 60 ఉన్నప్పటికీ ఏ ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇళ్లు రాలేదని చెంచు గిరిజనులు వాపోతున్నారన్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్న 20 కుటుంబాలకు రేషన్ కార్డులు లేవని 40 మంది పోడు భూములకు దరఖాస్తు ఫారాలు పెట్టుకుంటే కేవలం ఆరుగురికి మాత్రమే పట్టాలు వచ్చాయని, మిగతా 34 మంది వ్యవసాయ పొలాలకు సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలంలో దోమలు విపరీతంగా పెరగడంతో డెంగీ, మలేరియా, విష జ్వరాలు వస్తున్నాయని వారికి దోమ తెరలు, దుప్పట్లు ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

జీవనోపాధి కొరకు వలలు, బోట్లు, ట్రాక్టర్లు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బర్మల కురుమయ్య, వీరస్వామి, శివ, నిమ్మల మల్లయ్య, రాముడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

చెంచు పెంటల్లో...

మన్ననూర్, (ఆంధ్రజ్యోతి): నల్లమల లోతట్టు ప్రాంతంలోని చెంచులంతా కలిసి మల్లాపూర్ పెంటలో ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. మల్లాపూర్, రాంపూర్, పుల్లాయపల్లి, మేడిమాల్కల, పర్హాబాద్, ఆగర్లపెంట, రాయలేటి పెంట తదితర పెంటలకు చెందిన చెంచులంతా కలిసి ఆదివాసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆదివాసీ సంఘం నాయకులు పెద్ద బయ్యన్న, చిన్న బయ్యన్న, లక్ష్మయ్య, నిమ్మల బాలయ్యలింగయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



నంది వడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి భక్తులు శనివారం శ్రావణమాసం శుక్లపక్షం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని వైభవంగా ప్రత్యేక పూజలు చేశారు. సార్థసప్త జేష్టమాత సమేత శనీశ్వర స్వామికి నల్లని వస్త్రాలు ధరించి నల్లని వస్త్రం, నువ్వుల నూనె, జిల్లేడు పూలు వంటి సామగ్రితో ప్రత్యేక పూజలు చేసి ప్రదిక్షణలు చేస్తే సర్వ శనిదోషాలు పోతాయని ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి అన్నారు. శనిత్రయోదశి సందర్భంగా ఆలయానికి వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాల్ రావు తెలిపారు. అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య, కమిటీ సభ్యులు వీరశేఖర్, గోపాల్‌రెడ్డి, ప్రభాకరాచారి ఉన్నారు.

నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి ని చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ శనివారం తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 4.088 లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 205.877 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 4.630 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 244 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు అయన పేర్కొన్నారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరగానే చేరుకునే అవకాశం ఉందన్నారు.

కానిస్టేబుల్‌కు ఘన సన్మానం



జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్ జితేందర్‌ను సన్మానిస్తున్న రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మానవతా విలువలు, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన కానిస్టేబుల్ జితేందర్‌ను రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. వట్టెం గ్రామం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం సమాచారం అందుకున్న బిజినేపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎస్ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ జితేందర్ తన సొంత ఖర్చులతో రూ.6 వేలు వ్యయం చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. దీంతో కానిస్టేబుల్‌ను రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూల మాలలతో సన్మానం చేసి బహుమతిగా హెల్మెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎద్దుల వెంకటేష్ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో కానిస్టేబుల్ జితేందర్ సేవను ప్రశంసించారు. రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంభం మల్లేష్‌గౌడ్, సభ్యులు నరసింహారెడ్డి, అవుట శ్రీనివాసులు, విల్సన్, పెద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తిమీర పారబోసిన రైతు



కష్టపడి పండించిన కొత్తిమీరకు ధర రాకపోవడంతో పారబోసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం పోతులమడుగ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన శనివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన ఓ రైతు 4 ఎకరాల్లో కొత్తిమీర సాగు చేశాడు. కొత్తిమీరను శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లాడు. ఒక కట్టను రూ.20 నుంచి రూ.25కు విక్రయిస్తామని, రూ.5 రూపాయలకు కూడా కట్టను తీసుకోలేదని తెలిపాడు. దాంతో తిరుగు ప్రయాణంలో దాదాపు 200 కిలోల కొత్తిమీర కట్టలను పోతులమడుగు శివారులో పారబోసి వెళ్లాడు. స్థానికులు కొన్ని కట్టలను తీసుకెళ్లారు.

- భూత్పూర్, ఆంధ్రజ్యోతి

సదా మీ సేవలో..



అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా	: 8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

న్యూస్ బాక్స్

అందుబాటులో యూరియా నిల్వలు

ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు, అమరచింత మండలాల్లోని రైతులకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆత్మకూరు వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పంట దశ కోసం యూరియా సరఫరా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పైపాటుగా వేసుకోవడానికి రైతులు నానో యూరియా ఉపయోగించుకోవచ్చని యూరియాతో సమానమైన ఫలితాలు ఇస్తుందని తెలిపారు. ఆత్మకూరు ప్రాథమిక సహకార సంఘం, రేచింతల ప్రాథమిక సహకార సంఘం, ఆగ్రో రైతు సేవ కేంద్రం, హాకా రైతు సేవ కేంద్రాలలో కలుపుకొని 60 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధం చేశామన్నారు.

రైతు బీమాకు దరఖాస్తులు

పెబ్బేరు/ ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 5-6-2025 నాటికి పొలం రిజిస్ట్రేషన్ అయిన వారు 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు ఉన్న వారు, ఈ నెల 15వ తేదీలోగా క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. రైతు బీమా దరఖాస్తు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రైతుబీమాలో నామిని చనిపోయిన పట్టాదారు పేర్లు, నామిని పేర్లు, తప్పొప్పుల సవరణకు ఈ నెల 12వ తేదీలోగా సవరించుకోవాలని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ప్రసన్నలక్ష్మి



కొత్తకోట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రసన్న లక్ష్మి ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. శనివారం పెబ్బేరు మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి వాసవీ మాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య శెట్టి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా జిల్లా అధ్యక్షురాలిగా ప్రసన్న లక్ష్మిని ఎన్నుకున్నారు. కొత్తకోటకు చెందిన ఆర్యవైశ్య మహిళలు విజయలక్ష్మి, రాధిక, జయలక్ష్మి, భారతి, శాంత, నాగజ్యోతి, శ్యామల, విజయమ్మ, స్వర్ణలత అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



కేంద్ర పథకాలను వివరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అవుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కంబాలాపురం రాము పేర్కొన్నారు. మహా సంపర్క్ అభియాన్‌లో గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్మకూరు మండల పరిధిలోని మేడపల్లి జూరాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధుల కరపత్రాలను ప్రజలకు పంచి పెట్టారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశ రక్షణతో పాటు అన్ని రంగాల్లో భారత దేశం అభివృద్ధి చెందిందని, గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు ఆనంద్, మక్తల్ అసెంబ్లీ కో కన్వీనర్ శ్రీనివాస్, మనోహర్ గౌడ్, నరేష్, రాజు, సహదేవుడు, శంకర్ యాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారంతో విద్యార్థుల అవస్థలు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఆహారం కలుషితమై విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకులు షేక్ జహంగీర్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుకుంటున్న గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఆహారం కలుషితమై పరిస్థితులు విషయంగా మారుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు పురుగుల అన్నం తినలేక నిత్యం నరకం అనుభవిస్తున్నారని తెలిపారు. ఇటీవల నాగర్‌కర్నూల్ బీసీ మహాత్మాజ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో కూడా 70 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలైనట్లు వివరించారు. ప్రభుత్వం మొక్కుబడిగా ఆహార భద్రత కమిషనర్‌తో టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలతో పాటు బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

మూడేళ్లుగా నిలిచిన పనులు

- కలగానే మిగిలిపోయిన సమీకృత మార్కెట్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

పెబ్బేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సౌకర్యార్థం కోసం అన్ని రకాల వస్తువులు, ఆహార పదార్థాలు, కూరగాయలు ఒకే చోట లభించే విధంగా గత ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం శ్రీకారం చుట్టింది. ఏళ్లు గడుస్తున్న పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇతర గ్రామాల నుంచి ప్రజలు నిత్యం పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. ప్రత్యేక మార్కెట్ యార్డు లేకపోవడంతో మునిసిపాలిటీలో రోడ్డుకు ఇరువైపుల విక్రయదారులు కూరగాయాలు, పూలు, పండ్లు, చేపలు, మాంసం దుకాణాలతో రహదారులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. దీంతో అడుగడుగున ట్రాఫిక్ నిలిచి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కన ఉన్న కూరగాయలు, పండ్లు, మాంసం, కూరగాయాలు, పూలు ఇతర విక్రయాలు కొనసాగడంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతుంది. రోడ్డు పక్కనే ఉన్న విక్రయదారులు తాత్కాలికంగా కవర్లతో గుడారాలు వేసుకున్నప్పటికీ వర్షాలకు, ఎండలకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

సకల సౌకర్యాలతో ప్రజలకు ఒకే చోట కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం తదితర ఆహార వస్తువులు లభించేలా గత ప్రభుత్వం నవంబరు 3, 2021న సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సమీకృత మార్కెట్ ప్రజలకు అందుబాటులో ఉండేలా మునిసిపాలిటీలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 2ఎకరాల 20గుంటల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టేందుకు ప్రత్యేక నిధుల నుంచి రూ.2 కోట్ల నిధులతో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపుగా రూ.కోటి 20లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి ఫ్లోర్ వరకు పిల్లర్ల నిర్మాణ పనులు చేపట్టాడు. అనంతరం నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశాడు. మూడేళ్ల నుంచి పనులు ముందుకు సాగడంలేదు. అసంపూర్తి నిర్మాణంతో ఉన్న సమీకృత మార్కెట్ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సమీకృత మార్కెట్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరైన వెంటనే పనులు

నిధులు మంజూరు కాగానే కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు పెండిగ్ బిల్లులు చెల్లించి త్వరలోనే పనులు చేపడుతాం. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

- ఖాజా ఆరీఫ్‌ద్దీన్, మునిసిపల్ కమిషనర్, పెబ్బేరు

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు తొలి విడత చెక్కు అందజేత



ఖిల్లాఘణపురంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు రాజేశ్వరికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారు రాజేశ్వరికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరిత గతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుంటే ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం రూ.5 లక్షల అందజేస్తుందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇంటి నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించడానికి సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ఇంటి బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లించడంపై ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు రాజేశ్వరి హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక పూజలు

ఖిల్లాఘణపురం నరసింహ స్వామి గుట్టపై స్వయంభుగా వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పద్మశాలి కుల సంఘం ప్రతినిధులు నిర్వహించే ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలి కులస్తులు ప్రతీ ఏడాది రాఖీ పౌర్ణమి రోజు నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ ఊరేగింపు చేయడం సంప్రదాయంగా వస్తుందని అన్నారు. అనంతరం ఆలయ పూజారి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ మురళీధర్‌రెడ్డి, నాయకులు క్యామ వెంకయ్య, సాయిచరణ్‌రెడ్డి, ప్రకాష్, రవి నాయక్, ఎస్పీ రమేష్, బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, మున్నూరు జయకర్, రాములు నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు రాకపోకల అంతరాయం



రహదారి కోతకు గురి కావడంతో నిలిచిన వాహనాలు

శ్రీరంగాపురం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శేరుపల్లి శివారులో పెబ్బేరు, కొల్లాపూర్ ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులు గత రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైనప్పటికీ నేటికి పనులు పూర్తి కాలేదు. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు వాగు తీవ్ర ఉధృతంగా పారింది. దీంతో రహదారి పూర్తిగా కోతకు గురికాగా.. వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం పెబ్బేరు సంత కావడంతో కొల్లాపూర్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల నుంచి వ్యాపారులు, గొర్రెలు, మేకలు, పశువులు సంతకు తరలిస్తుంటారు. భారీ వర్షాల కారణంగా రహదారి దెబ్బతినడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

భారీ వర్షానికి పంట నష్టం

రేవల్లి : భారీ వర్షాలకు రైతులు పంటలను నష్టపోయారు. వరి పొలాల్లోని వరాలు తెగి పంట కొట్టుకుపోయింది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తలుపునూరులో పత్తి పంటలో నిలిచిన నీరు

మార్కండేయ ఆలయంలో నూలు పౌర్ణమి



ఊరేగింపు నిర్వహిస్తున్న పద్మశాలీలు

అమరచింత, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నూలు పౌర్ణమి సందర్భంగా శనివారం అమరచింత భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూలు పుట్టిన దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కండే ఆలయంలో పద్మశాలీల కుల దైవమైన మార్కండేయకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఊరేగింపులో మార్కండేయ చిత్రపటాన్ని ప్రత్యేక రథంలో పురవీధుల వెంట ఊరేగించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవరకొండ, మహంకాళి, శ్రీనివాసులు, అచ్చన్న, విష్ణు, తాటికొండ రమేష్, క్యామ శ్రీనివాసులు, చింతన్న, బాలస్వామి, ఉషన్న, సోములు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



గిరిజన రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాన్‌గల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, మండల పరిధిలోని కిష్టాపూర్ తండాకు చెందిన 12 మంది గిరిజన రైతులపై అటవీ శాఖ అధికారులు పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరసాగర్ డిమాండ్ చేశారు. గిరిజన రైతులకు మద్దతుగా శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తండాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలన్నారు. అటవీ శాఖ అధికారులు గిరిజన రైతులను వేధించడం సరికాదన్నారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులపై కేసులు పెట్టడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలో కూడా గిరిజనులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కిష్టాపూర్ గ్రామ గిరిజన రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సోమనాథ్ నాయక్, తిలకేశ్వర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, బండి సరోజ, చంద్రు నాయక్, సుధాకర్‌యాదవ్, సుధాకర్ నాయక్, బాలస్వామి, కృష్ణ, శాంతన్న, రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

కొత్తకోట ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలోని నాలుగు గ్రామాల సరిహద్దుల్లోని వెంకటగిరి క్షేత్రంలో వెలిసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా శనివారం నిర్వహించారు. శ్రావణ మాసంలో వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా వెంకటగిరిలో శ్రీలక్ష్మీ, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో ఆలయ పూజారి నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ పల్లకీ సేవలో గోవిందా నామస్మరణ చేస్తూ.. మహిళలు మంగళహారతులతో ఊరేగించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు దాబ శ్రీనివాస్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌శెట్టి, బాల్‌రెడ్డి, జలేంధర్‌రెడ్డి, వెంకటేష్, దామోదర్‌రెడ్డి, తిరుపతయ్య, నీలేష్ కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, గురుస్వామి, కృష్ణారెడ్డి ఎల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తుల రద్దీ

వనపర్తి రూరల్ : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామ శివారు తిరుమలయ్య గుట్ట సమీపంలోని వేంకటేశ్వర స్వామి దర్శనానికి శ్రావణ మాసం మూడో శనివారం కావడంతో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఉదయం వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం బారులు తీరారు. ఆలయ పరిధిలో జాతర ముమ్మరంగా సాగుతుంది.



గుట్టపైకి కాలి నడకన వెళ్తున్న భక్తులు

నియమాలు పాటించి.. ప్రమాదాలు నివారించాలి



హెల్మెట్ ధరించిన వారికి రాఖీ కడుతున్న పోలీసులు

వనపర్తి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడమే కాదు.. ఆ నిబంధనలు పాటించే వారిని గౌరవిస్తామని వనపర్తి ట్రాఫిక్ పోలీసులు అన్నారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని వనపర్తి సీఐ కృష్ణయ్య అన్నారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి సీఐ, కృష్ణయ్య వనపర్తి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారులకు మహిళా కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు రాఖీలను కట్టి పువ్వులు, స్వీట్లు పంచుతూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. వనపర్తి సీఐ కృష్ణయ్య, పట్టణ ఎస్ఐ, హరిప్రసాద్, సురేందర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘం నాయకుడికి సేవా భూషణ్ అవార్డు

కొత్తకోట ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనిమెట్టకి చెందిన దివ్యాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమ ప్రభాకర్‌శెట్టికి సేవా భూషణ్ అవార్డు అందుకున్నట్లు శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ప్రముఖ సంస్థ మోహన్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి శుక్రవారం రాత్రి అవార్డులు అందజేశారు. కొంత కాలంగా దివ్యాంగుల సంఘ నాయకుడిగా దివ్యాంగులను చైతన్యం చేస్తూ ప్రభుత్వ పథకాలు అందించడంలో కృషి చేస్తున్నందుకు అవార్డు ఇచ్చారని చెప్పారు. ప్రభాకర్‌శెట్టికి సేవా భూషణ్ అవార్డు రావడంతో గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆత్మీయ, అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సోదరీ సోదరుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను శనివారం జిల్లాలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువతులు, మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. రాఖీ కట్టిన తమ అక్కా చెల్లెళ్లకు వారి సోదరులు చిరు కానుకలు సమర్పించి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. తమ అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టడానికి పుట్టింటికి వచ్చిన ఆడపడుచులతో ఆయా ఇళ్లల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాలు, పట్టణాల్లో పలువురు రాజకీయ నాయకులకు కూడా స్థానిక మహిళలు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారీలు కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టిన వారిలో ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వనపర్తి కేంద్రం నిర్వాహకులు శోభ, నాగమణి, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు : రక్షాబంధన్ వేడుకలను ఆత్మకూరు పట్టణ, మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించుకున్నారు.

- మక్తల్ నియోజకవర్గం యూత్ మాజీ అధ్యక్షుడు తులసీ రాజుకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హైదరాబాద్‌లో రాఖీ కట్టినట్లు రాజు తెలియజేశాడు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌లకు మహిళా కానిస్టేబుళ్లు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



నిరంజన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి రేఖమ్మ



వనపర్తి ఆర్టీసీ కాలనీలో రాఖీ కడుతున్న అక్క

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో...

పెబ్బేరు రూరల్ / పెబ్బేరు / కొత్తకోట : పట్టణంలో ఆత్మీయ అనురాగానికి ప్రతీకగా నిలిచిన రాఖీ వేడుకలను అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడు శనివారం నిర్వహించుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా కొత్తకోటలోని దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. అలాగే రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ డిపో దగ్గరికి వెళ్లి...

వనపర్తి రూరల్ : ఓ మహిళ అత్తారింటి నుంచి పుట్టింటికి వచ్చినా తన తమ్ముడు అందుబాటులో లేకపోవడంతో తమ్ముడు పని చేసే ఆర్టీసీ డిపో దగ్గరికి వెళ్లి డ్యూటీలో ఉన్న తమ్ముడికి రాఖీ కట్టింది.

- రాఖీ పండుగ సందర్భంగా బస్టాండు కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా నిలబడేందుకు జాగ లేక ఇబ్బందులు పడుతూ బస్సుల్లో పుట్టింటికి వెళ్లారు.

మహిళలకు పెద్ద అన్న అంబేడ్కర్

గోపాల్‌పేట : దేశంలో ఉన్న మహిళలకు అంబేడ్కర్ పెద్ద అన్న లాంటి వారని మహిళలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి చిన్నా, పెద్ద తేడా లేకుండా రాఖీలు కట్టి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. భారతదేశంలో పుట్టిన ప్రతీ ఒక్కరికి అంబేడ్కర్ తన రాజ్యాంగంతో పెద్ద కొడుకులా పెద్ద దిక్కు అయ్యాడని అన్నారు.

అమరచింత/ ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ వేడుకలను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ సభ్యులు భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సుగుణ, పోలీస్ స్టేషన్‌లో మహిళ కానిస్టేబుళ్లు ఆర్ఎస్ఎస్ ప్రముఖులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.



గోపాల్‌పేటలో అంబేడ్కర్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

రెండు గొప్ప బంధాల వారధి

వనపర్తి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రక్షాబంధన్ రెండు గొప్ప బంధాల వారిధి అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిరంజన్‌రెడ్డికి సోదరీమణి శేషిరేకమ్మ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... అన్న చెల్లెలు, అన్నదమ్ముల మధ్య అనుబంధానికి ఆత్మీయతకు నిదర్శనంగా రాఖీ పండుగ జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అలేఖ్య, మౌనిక, సాయిలీల, కవిత, శ్వేత, నాయకులు వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, తిరుమల్, లక్ష్మీ నారాయణ, గిరి పాల్గొన్నారు.



వనపర్తిలో డ్యూటీలో ఉన్న తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



మక్తల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసిరాజ్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



ఖిల్లాఘణపురంలో హిందూ వాహిని సభ్యుడికి రాఖీ కడుతున్న తహసీల్దార్ సుగుణ



అమరచింతలో...



ఆత్మకూరు సీఐ శివకుమార్‌కు రాఖీ కట్టి హారతి ఇస్తున్న మహిళా కానిస్టేబుళ్లు



ఆత్మకూరు ఎస్ఐ నరేందర్‌కు రాఖీ కడుతున్న కానిస్టేబుళ్లు



గోవర్ధనగిరిలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క